సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం | 18 | అక్టోబర్ | 2024



ఐటీఐలో అడ్వాన్స్‌డ్ కోర్సులు..
ఐటీఐలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశానికి ఐటీడీఏ ఆధ్వర్యాన నేడు ఏటూరు నాగారంలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. - 8లో▸



ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన ఆర్టిజన్‌లతో భర్తీ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.4^{0} / 24.5^{0}
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూసేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు



కాళేశ్వరం: మహదేవపూర్ టు కాళేశ్వరం వరకు జాతీయ రహదారి 353(సీ) రోడ్డు నిర్మాణం కోసం కాళేశ్వరం శివారులో భూసేకరణ సర్వేను రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు చేపట్టారు. గురువారం సర్వేకు వచ్చిన అధికారులను భూములు కోల్పోతున్న రైతులు అడ్డుకొని సర్వే చేయకుండా అభ్యంతరం తెలిపారు. కొంతమంది రైతులు సర్వేకు ఒప్పుకున్నారని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. వారివెంట ఎస్‌హెచ్ డీఈఈ కిరణ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గణేష్ జాదవ్, సర్వేయర్ రమేష్, ఆర్‌ఐ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌హెచ్ ఏఈఈ ఉన్నారు.

ఉదయశ్రీకి కాంస్య పతకం



భూపాలపల్లి అర్బన్: ఉత్తరాఖండ్‌లో జరిగిన ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్స్ పోటీల్లో భూపాలపల్లికి చెందిన క్రీడాకారిణి ఎం.ఉదయశ్రీ కాంస్య పతకం సాధించారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తుంది. ఆల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో కోల్ ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ 100 మీటర్ల రేసులో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి సింగరేణి, భూపాలపల్లి ఏరియాకు పేరు తీసుకురావాలని ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్ కోరారు.

స్ట్రక్చరల్ సమావేశాలు ఏర్పాటుచేయాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి స్ట్రక్చరల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మంద నరసింహారావు కోరారు. ఏరియాలోని కేటీకే 5వ గనిలో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు నరసింహారావు హాజరై మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 10 నెలలు అవుతున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదన్నారు. స్ట్రక్చరల్ సమావేశాలు ఏర్పాటుచేసి కార్మికుల సమస్యలపై చర్చించాలని కోరారు. కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని, ఆదాయపన్ను రద్దుచేయాలని, అలవెన్స్‌ల సవరణ, మారుపేర్ల సవరణకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమణ, కార్మికులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

మొగుళ్లపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి గురువారం భూపాలపల్లి సివిల్ జడ్జి రాంచందర్‌రావు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దురిశెట్టి నవీన్ చారి, తోడేటి ఓంకార్, ఇరుప సురేష్, తిప్పరబోయిన సతీష్, సిలువేరు హరీశ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుచగా రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

భూపాలపల్లి అర్బన్: మూడు రోజుల క్రితం మండలంలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పేరాల వెంకటేష్ కుటుంబ సభ్యులు గురువారం జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి–పరకాల ప్రధాన రహదారిపై మృతదేహంతో బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి లారీ యాజమాని నుంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారి మైసమ్మ దేవాలయ సమీపంలో ధర్నా చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం సుమారు గంట పాటు ఆందోళన చేపట్టడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్‌యాదవ్ ఆందోళన వద్దకు చేరుకొని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సందడి

- ఒక్కో నియోజకవర్గానికి 3,500..
- కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- జిల్లాలో మొదలైన ప్రక్రియ
- కమిటీల ఏర్పాటుకు శ్రీకారం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



కాళేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మార్గం సుగమమైంది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్రూం ఇళ్ల చొప్పున మంజూరుచేసిన ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియమించేందుకు శ్రీకారం చుట్టింది. పేద, మధ్య తరగతి కుటుంబాల కలలు నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసేందుకు రంగం సిద్ధంచేసింది. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున విడతల వారీగా ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామ పంచాయతీల వారీగా, మున్సిపాలిటీల్లో డివిజన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆశలు రేకెత్తుతున్నాయి.

ఆశావహుల్లో సందడి..

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ఆయా పట్టణాలు, గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలు పూర్తిగాక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాటారంలో నిర్మాణాలు నత్తనడకనే ఉన్నాయి. తదితర ప్రాంతాల్లో కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిర్మించిన ఇళ్లకు మౌలిక వసతులు లేకపోవడంతో వాటి పనులు కొనసాగుతున్నాయి. బీఆర్‌ఎస్ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షలు, ఇతరులకు రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించింది. గతేడాది నవంబర్ నెలాఖరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు మాసాల క్రితం ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొంది. కమిటీల ఎన్నిక జోరందుకోవడంతో ఆశావహుల్లో సందడి నెలకొంది.

గ్రామాల్లో కమిటీల ఎంపిక

అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే వారిని ఎంపిక చేయాలని కమిటీల కసరత్తు ప్రారంభించింది. ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గ్రామాలు, మున్సిపల్ కార్పొరేషన్లు, వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ కమిటీలను నియమించేందుకు ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రక్రియను జిల్లాలో కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 241 గ్రామ పంచాయతీలు ఉండగా, 241 ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను నియమించనున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ, నియోజకవర్గం, మంథని నియోజకవర్గం కాటారం సబ్‌డివిజన్‌లో కమిటీలను ఎంపిక చేయనున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే కమిటీలు పూర్తిచేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్‌గా సర్పంచ్ లేదా గ్రామ ప్రత్యేకాధికారి ఉండనున్నారు. స్వశక్తి సంఘాల గ్రూపులకు చెందిన ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉండనున్నారు. మరో ముగ్గురు మహిళలు గ్రామ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించేవారిని నియమించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని తప్పనిసరిగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. మున్సిపాలిటీల్లోనూ వార్డుల వారీగా కమిటీలను నియమించనున్నారు. మున్సిపాలిటీలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా ఉండనున్నారు. మిగతా సభ్యులు గ్రామపంచాయతీలో వలే ఉండనున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది. పూర్తిస్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు కీలక పాత్ర పోషించనున్నారు.

> **కమిటీల ఎంపిక చేపట్టాం..**
> ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఎంపిక ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుంది. ఈ కమిటీల ఎంపిక పూర్తయిన తర్వాత ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలను అనుసరించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.
> -విజయలక్ష్మి, అదనపు కలెక్టర్

వైద్య విద్యార్థులకు ఇబ్బంది రానివ్వం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- వాల్మీకి సందేశాలు స్ఫూర్తిదాయకం
- కలెక్టర్ రాహుల్ శర్మ



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి: వైద్య విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు, సింగరేణి జీఎం, వైద్య కళాశాల కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ వైద్య కళాశాలను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వైద్య కళాశాలలో 120మంది బాలికలు, 80మంది బాలురు వైద్య విద్యను అభ్యసిస్తున్నారన్నారు. సింగరేణి అధికారులతో చర్చించి అదనంగా రామప్ప కాలనీలో 14 క్వార్టర్లతో కూడిన ఒక బ్లాక్ కేటాయించాలని కోరినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి వైద్య కళాశాల భవన నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న బకాయిలు మంజూరు చేయిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాన్ని సంవత్సరం కాలంలో పూర్తి చేపిస్తామన్నారు. రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతుల నిర్వహణకు అవసరమయ్యే ప్రాక్టికల్ ల్యాబ్, లెక్చరర్ హాల్‌ను 20రోజుల్లో అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు కళాశాల నుంచి జిల్లా ఆస్పత్రికి వెళ్లడానికి రెండు బస్సులు ఏర్పాటు చేస్తామని, 21వ తేదీ నుంచి రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు పూర్తికాగానే క్లాసులు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్, వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలి..

30 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి మధుమేహ, బీపీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఆరోగ్య కార్యకలాపాలపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని తెలిపారు. అన్ని ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సమితి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. యాస్పిరేషనల్ బ్లాక్ మండలాలైన పలిమెల, మహాముత్తారం మండలాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

వాల్మీకి సందేశాలు స్ఫూర్తిదాయకం..

వాల్మీకి సందేశాలు ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి సందేశాలు సమాజాన్ని సద్గుణ మార్గంలో నడిపే విధంగా ఉంటాయన్నారు. వాల్మీకి జీవితం, సాహిత్యసేవలు, సమాజానికి ఎంతో ఆచరణాత్మకమని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంస్కృతి సాహిత్యంలో ప్రముఖ వ్యక్తి వాల్మీకి అని కొనియాడారు. రామాయణం వంటి మహా కావ్యాన్ని రచించి, సామాన్య ప్రజలకు నైతికత, ధర్మం, జీవనసారాన్ని నేర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శైలజ, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు అందించాలి



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డే రాంచందర్

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతీ పథకం అర్హులైన నిరుపేదలకు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డే రాంచందర్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు మందిరంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాల అమలులో నిర్లక్ష్యం జరిగితే అధికారులపై డిసిప్లీనరీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూమిలేని నిరుపేదలకు భూమి ఇవ్వాలన్నారు. అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని.. ఏమాత్రమూ సహించేది లేదని హెచ్చరించారు. రుణాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీం ఎక్కువమంది లబ్ధిదారులు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని.. ఈ పథకం వల్ల పేద కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. అన్ని శాఖల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు అమలుతీరును సమీక్షించిన ఆయన కలెక్టర్, ఎస్పీ, తదితర అధికారులను అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్ బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీఓ మంగీలాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరిన 'కొండా' వివాదం

- రెండు వర్గాలుగా విడిపోయిన 'వరంగల్' ఎమ్మెల్యేలు
- మంత్రి సురేఖ మితిమీరిన జోక్యంపై సీఎం, టీపీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు
- సురేఖ మాకు స్ఫూర్తి అన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి
- గ్రూపులపై ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆరా..
- సమన్వయం కోసం ఇన్‌చార్జ్ మంత్రి 'పొంగులేటి' ప్రయత్నం
- 'హస్త'వ్యస్తంగా ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న వివాదం ఢిల్లీకి చేరింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ ప్రత్యక్షంగా, మరో ఎమ్మెల్యే పరోక్షంగా సీఎం, టీపీసీసీ చీఫ్‌లకు ఫిర్యాదు చేయడం దుమారం రేపింది. ఇదే సమయంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసిన ఎమ్మెల్యేలు.. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో 'కొండా' దంపతుల మితిమీరిన జోక్యంపై వివరించినట్లు సమాచారం. ఆలయ కమిటీలు మొదలు పలు నామినేటెడ్ పోస్టులపై స్వయం నిర్ణయం తీసుకుంటుండడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ పరిణామాలన్నింటిపై టీపీసీసీ చీఫ్, ఏఐసీసీ పరిశీలకులనుంచి ఢిల్లీ పెద్దలు సమగ్ర నివేదిక తెప్పించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'వరంగల్ వివాదం'పై గురువారం పార్టీ సీనియర్లు, ప్రజాప్రతినిధులను ఆరా తీయడం చర్చనీయాంశంగా మారింది.

హాట్‌టాపిక్‌గా గ్రూపుల పోరు..
అగ్రనేతల సంప్రదింపులు..

ఓరుగల్లు కాంగ్రెస్‌లో గ్రూపుల పోరు రాష్ట్రస్థాయిలో హాట్‌టాపిక్‌గా మారింది. మంత్రి కొండా సురేఖపై సొంత జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫ్లెక్సీ వివాదంతో మొదలు. ప్రత్యక్ష ఫిర్యాదుల దాకా వెళ్లడం.. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ రంగంలోకి దిగడం పొలిటికల్ హీట్‌ను పెంచింది. ఇదే కాకుండా ఢిల్లీ హైకమాండ్ వరకు వెళ్లిన కొండా సురేఖ వివాదంపై ఏఐసీసీ కీలక నేత కేసీ వేణుగోపాల్ ఆరా తీస్తుండటం కలకలం రేపుతోంది. టీపీసీసీ చీఫ్, దీపాదాస్ మున్షీలతో ఆగకుండా తన అపాయింట్‌మెంట్ కోరడం ద్వారా తీవ్రతను అర్థం చేసుకున్న వేణుగోపాల్ ఒకరిద్దరు ఎమ్మెల్యేలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడినట్లు కూడా చెబుతున్నారు. ఇదే సమయంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లకు సూచనలు ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాత్రి ఉమ్మడి వరంగల్ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలతో మాట్లాడి నట్లు తెలిసింది. ఇదే సమయంలో మేడారం పర్యటనను ముగించుకున్న మంత్రి సురేఖ సైతం హైదరాబాద్‌కు చేరుకుని దీపాదాస్ మున్షీ, బొమ్మ మహేష్‌కుమార్ తదితర నేతలకు వివాదాలకు కారణమైన పలు అంశాలను వివరించినట్లు సమాచారం. కొండా సురేఖ వర్సెస్ జిల్లా ఎమ్మెల్యేల పంచాయితీపై అందరినీ సమన్వయం చేసేందుకు మరోమారు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ, టీపీసీసీ ఇన్‌చార్జ్‌లు శుక్రవారం భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

గ్రూపులుగా ఎమ్మెల్యేలు..



వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఏడుగురు ఎమ్మెల్యేలు రెండు గ్రూపులుగా విడిపోయినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. వరంగల్ తూర్పునుంచి ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఆమెపై ఫిర్యాదు చేసిన వారిలో స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణతోపాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయా నియోజకవర్గాల్లో జరిగిన సంఘటనలు.. ప్రొటోకాల్, ప్రభుత్వ కార్యకలాపాలు, వ్యక్తిగత వ్యవహారాల్లో మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకోవడం నచ్చడం లేదని ఈ సందర్భంగా సదరు ఎమ్మెల్యేలు పేర్కొన్నట్లు సమాచారం. కాగా, రెండు రోజుల కిందట వరంగల్‌లో ఓ కార్యక్రమానికి హాజరై ఫొటో దిగిన పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి.. 'ప్రజల పక్షాన నిలబడి నిలదొక్కుకుంటానని నిరూపించుకున్న డైనమిక్ లీడర్ కొండా సురేఖ నిబద్ధత మాకు స్ఫూర్తి' అని ఎక్స్‌లో మద్దతుగా నిలవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. 'బీసీ మహిళా నేతగా.. మంత్రిగా ఉన్న తనను కావాలనే బద్నాం చేస్తున్నారని' కొండా సురేఖ తనపై వస్తున్న ఆరోపణలపై స్పందించారు. కేటీఆర్ తనపై విషప్రచారం చేసిన సమయంలో చేసిన కామెంట్స్‌పై సైతం కుట్రలో భాగంగానే రాద్ధాంతం చేశారంటున్నారు.



ట్విట్టర్‌లో ఎమ్మెల్యే యశస్విని చేసిన పోస్ట్

వైద్యాధికారులు అంకితభావంతో పనిచేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని చిన్న గంగారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాహారం తీసుకోవాలని, సమయానుకూలంగా మందులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు భవ్యశ్రీ,, సిబ్బంది యాకలక్ష్మి, రాఘవులు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ ఆస్పత్రి పరిశీలన



వాజేడు: రికార్డులను పరిశీలిస్తున్న అప్పయ్య

వాజేడు: మండల పరిధిలోని కంటైనర్ వైద్యశాలను డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య గురువారం పరిశీలించారు. రికార్డులను చూసిన ఆయన రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటు అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కొమురం భీమ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఏటూరునాగారం: కొమురం భీమ్ పోరాటాన్ని ఆదివాసీలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని ఐటీడీఏ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పీఓ పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి కొమురం భీమ్ అనేక పోరాటాలు సాగించారని ఆయన సేవలను కొనియాడారు. ఆదివాసీల అభివృద్ధికి ఐటీడీఏ నిరంతరం పనిచేస్తోందన్నారు. సమస్యలు ఉంటే నేరుగా ఐటీడీఏకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రాజ్‌కుమార్, పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

భూపాలపల్లి: సాధారణ వ్యక్తి స్థాయి నుంచి మహర్షిగా ఎదిగిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రామాయణాన్ని సంస్కృతంలో రచించి భారతావనికి అందించిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి రచనలు నైతిక పరివర్తనను వెల్లడిస్తుందని, ధర్మాన్ని అనుసరించి ఎలా జీవించాలో దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఓఎస్డీ) బోనాల కిషన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం, సీసీ ఫసియొద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలు



భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా ఎస్‌వోటు జీఎం కవీంద్ర హాజరయ్యారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవికుమార్, సురేఖ, వసంత్, మారుతి, పాటక్, మురళీమోహన్ పాల్గొన్నారు.

గోదావరికి హారతి

కాళేశ్వరం: పౌర్ణమి సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం పరిధిలోని త్రివేణి సంగమ గోదావరికి గోదావరి హారతి కార్యక్రమాన్ని అధికారులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం నుంచి గురువారం సాయంత్రం మంగళవాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ గోదావరికి కాలినడక తరలివెళ్లారు. అక్కడ గోదావరి మాతకు విశేష పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం హారతి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మాజీ దేవస్థానం డైరెక్టర్ శ్యాంసుందర్ దేవుడా, భక్తులు, భూపాలపల్లి, అన్నమయ్య సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



కాళేశ్వరంలో త్రివేణి సంగమ గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

క్లుప్తంగా

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువును అపరాధ రుసుములేకుండా ఈనెల 28వతేదీ వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి గురువారం తెలిపారు. రూ. 50 అపరాధ రుసుముతో నవంబర్ 2వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

ఖిలా వరంగల్: లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసి నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. శాకరాశికుంటలోని పర్విన్ అనే మహిళ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు భిక్షానాయక్, సతీశ్, ఈశ్వర్ గురువారం పర్విన్ ఇంటిపై దాడి చేసి రూ.17,500 విలువైన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేశారు. అనంతరం పర్విన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో 5.5 క్వింటాళ్లు పట్టివేత..



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

వరంగల్: అక్రమంగా పీడీఎస్ బియ్యం డంప్ చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు వివేకానందకాలనీ, తిలక్‌రోడ్డులోని వనం కృష్ణమూర్తి, గోలి పవన్ ఇళ్లపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.14,300 విలువైన 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్‌ఎస్సై బి.శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ సీజ్



జేసీబీ, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మడికొండ: అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ ఆపరేటర్లపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఏఎస్సై చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుల్ రాంచందర్, కానిస్టేబుల్ సతీశ్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా ఇందిరమ్మ కాలనీ శివారులో మట్టితో వెళ్తున్న ట్రాక్టర్లను ఆపి, డ్రైవర్లు రాపోలు విజయ్, దండ్ల ప్రసాద్, దారంగుల రాజు, ఎత్తరి కల్యాణ్, జేసీబీ ఆపరేటర్ పల్లపు నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఐటీఐలో అడ్వాన్స్‌డ్ కోర్సులు..

- నేడు ఏటూరునాగారం ఏటీసీలో ప్రవేశాలకు ఎంపికలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తరలిరానున్న విద్యార్థులు



మిషనరీని పరిశీలిస్తున్న అధికారులు, అధ్యాపకులు

ఏటూరునాగారం: పదో తరగతి పూర్తయిన అనంతరం ఏ కోర్సులో ప్రవేశం పొందాలి.. ఏ కోర్సుకు ఆదరణ ఉంది.. ఏ కోర్సులో చేరితే జీవితం బాగుటుందనే ఆలోచనలో ఉన్న విద్యార్థులకు శుభవార్త. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలో ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సులకు రూపకల్పన చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టుంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధ్వర్యంలో నేడు(శుక్రవారం) మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో విద్యార్థుల ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ ప్రక్రియ ఉదయం నుంచి జరగనుంది. కాగా, గతంలో మండల కేంద్రంలో గిరిజన బాలబాలికల ఐటీఐ మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఐటీఐతోపాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసి ఆరు కోర్సులను ప్రవేశపెట్టింది.

ఆరు కోర్సులు.. 172 సీట్లు

ఐటీఐలో కేవలం కొన్ని కోర్సులతో విద్యార్థుల భవిష్యత్ మారడం లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఆరు కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ కోర్సుల్లో ఏ విద్యార్థికి ఏ ట్రేడ్ ఆసక్తి ఉందో నిబంధనల మేరకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి ట్రేడ్‌లలో శిక్షణ ఇచ్చేందుకు ఐటీఐకి కావాల్సిన మిషనరీ అందుబాటులో ఉంది. దీనిని ఈనెల 21వ తేదీన నిపుణుల సమక్షంలో అమర్చి వాటి ద్వారా ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో ట్రేడ్‌కు సీట్లను పరిమితి చేశారు. కేవలం ఆ సీట్లు పొందిన వారికే ఈ శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం ఆరు కోర్సులకు గాను 172 సీట్లు కేటాయించారు. శిక్షణ అనంతరం డాటా కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పదో తరగతి ఉత్తీర్ణత పొందిన బాలురు, బాలికలు నేడు(శుక్రవారం) 9 గంటలకు పదో తరగతి మెమో, కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనోఫైడ్ సర్టిఫికెట్, టీసీ, ఆధార్ ప్రతులతో గిరిజన భవన్‌లో జరిగే ఎంపికల కార్యక్రమానికి హాజరుకావాలని అధికారులు తెలిపారు.

కోర్సుల వివరాలు

ట్రేడు కోర్సు	అర్హత	కోర్సు కాలపరిమితి	సీట్ల సంఖ్య
మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్	10	1	40
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	10	1	40
ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	10	1	20
బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్)	10	2	24
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ, మిషనింగ్ టెక్నీషియన్	10	2	24
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్	10	2	24

ఎంపికలను సద్వినియోగం చేసుకోవాలి



ఏటీసీలో జరిగే ఎంపికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన బాలబాలికలకు అవకాశం కల్పిస్తాం. ప్రభుత్వం కల్పించిన ఈ ఆరు కోర్సులలో చేరి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలి.

జగన్‌మోహన్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్, ఏటూరునాగారం

రేపటి నుంచి అంతర్ కళాశాలల క్రీడలు

- వివరాలు వెల్లడించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో శనివారం నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు గురువారం ఆ కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించబోతున్నామన్నారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 12 టీమ్‌లు, క్రాస్‌కంట్రీ, హ్యాండ్‌బాల్‌కు 14, కబడ్డీలో 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీమ్‌లు.. మొత్తం సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొనబోతున్నారన్నారు. ఈ పోటీలు ఈనెల 19 నుంచి 21వ తేదీవరకు జరుగుతాయన్నారు. క్రీడాకారుల కోసం ఆర్ట్స్ కాలేజీ, పీజీ కళాశాల, ఎంబీఏ విభాగంలో వసతి వసతి ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడల ప్రారంభ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయినిరాజేందర్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య, అర్జున అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, ఒలంపిక్ కాంస్య పతక విజేత దీప్తి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లారమేశ్, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఇండస్ట్రీ అవసరాల మేరకు సిలబస్ ఉండాలి

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా సిలబస్ ఉండాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అన్నారు. గురువారం కేయూలోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాలలోని సెమినార్‌హాల్‌లో 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంకామ్, ఎంబీఏ కోర్సుల సిలబస్‌ను సవరించిన నేపథ్యంలో అమలుకోసం సంబంధిత కోర్సుల యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల అధ్యాపకుల అవగాహన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రొటీన్ సబ్జెక్టులతో పాటు స్టాటిస్టిక్స్, గణితం, ఇంజనీరింగ్ అంశాలు బోధించినప్పుడు విద్యార్థి ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. సిలబస్‌లో అప్లికేషన్ పార్ట్, కేస్‌స్టడీస్, ప్రాజెక్టు వర్క్, రియల్ టైం ఎక్స్‌పర్టింగ్ ఉండాలన్నారు. మార్కెట్ డైనమిక్‌గా ఉందని, అందుకు అనుగుణంగా విద్యాబోధన, పరిశోధన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా అధ్యాపకులు సిద్ధంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి మాట్లాడుతూ సుమారు 10 సంవత్సరాల తరువాత నూతన అంశాలు జోడించి సిలబస్‌ను రూపొందించారన్నారు.ఆ కళాశాల బీఓఎస్ కట్ల రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెరిగేలా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు తీసుకొచ్చామన్నారు. అనంతరం యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ పి. వరలక్ష్మి, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి మాట్లాడారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపికలు



సైదానాయక్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: మహారాష్ట్రలోని జలగం యూనివర్సిటీలో నవంబర్12 నుంచి 21వతేదీ వరకు జరిగే సౌత్‌జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక ప్రక్రియ గురువారం క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి మాట్లాడుతూ సౌత్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో ముగ్గురు విద్యార్థినులు, ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు రన్నింగ్, పరేడ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ యూత్ ఆఫీసర్ రమావత్ సైదానాయక్, ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యుడు ఆర్. ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కుమార్, రాధిక తదితరులు పాల్గొన్నారు. కాగా, యూత్ ఆఫీసర్ రమావత్ సైదానాయక్‌ను కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి సన్మానించారు.

ఆరు జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆరు జిల్లాల జట్ల ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ దేశాయిపేట్‌లోని సీకేఎం కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా ఆరు జిల్లాల జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాల జట్లు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరిగే అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇందులో రాణించిన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ కేంద్రంగా నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న అండర్–23 అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపిక అవుతారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

క్రీడల విజయవంతానికి సహకరించాలి

- హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్
- 25, 26 తేదీల్లో అండర్–19 ఎస్‌జీఎఫ్ పోటీలు



మాట్లాడుతున్న డీవైఎస్ఓ అశోక్

వరంగల్ స్పోర్ట్స్ : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో రెండు విడతలుగా నిర్వహించనున్న పాఠశాల క్రీడల సమాఖ్య అండర్–19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలకు పీడీ, కోచ్‌లు సహకరించి విజయవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ అన్నారు. క్రీడల నిర్వహణపై గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీ, కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడతలో 25, 26 తేదీలు, రెండో విడతలో 28,29వ తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాంశాలు, వేదిక తదితర అంశాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, లేటెస్ట్ బోనోఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్, మెమోపై తప్పనిసరిగా కళాశాల ప్రిన్సిపల్ సంతకం తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారులు గోపాల్, డాక్టర్ శ్రీధర్, సంగెం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మాధవరావు, పీడీ, పీఈటీ, కోచ్‌లు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్ నగర్‌లో చోరీ

వరంగల్: వరంగల్ దేశాయిపేట ఎస్‌పీఆర్ నగర్‌లో ఎస్‌కే.హీనా సుల్తానా అనే మహిళ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. ఈ ఘటనలో 6 తులాల బంగారం, 45తులాల వెండి ఆభరణాలతోపాటు కొంత నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గురువారం తెలిపారు.

ఖాళీ పోస్టులను ఆర్టిజన్‌లతో భర్తీ చేయాలి

- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ కె. ఈశ్వర్ రావు
- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా



మహాధర్నాకు హాజరైన ఆర్టిజన్లు


హన్మకొండ: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన ఆర్టిజన్‌లతో భర్తీ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల నుంచి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా ఆర్టిజన్ ఉద్యోగులు తరలివచ్చారు. భారీగా తరలిరావడంతో ప్రధాన రహదారి ఆర్టిజన్‌లతో కిక్కిరిసిపోయింది. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. అంతకు ముందు ఆర్టిజన్‌లు హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి ర్యాలీగా ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మహాధర్నా అనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. స్పందించిన సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం కె.ఈశ్వర్ రావు మాట్లాడుతూ ఆర్టిజన్‌లను కన్వర్షన్ చేయడమే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. అర్హులైన ఆర్టిజన్‌లను విద్యార్హతలను బట్టి జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాల్లో నియమించాలన్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపుతుందని ఆశతో ఉన్నారన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమస్య పరిష్కరించాలన్నారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎం.ఎ.వజీర్ మాట్లాడుతూ ఆర్టిజన్‌లకు ప్రతి అంశంలో అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టిజన్‌లుగా విద్యుత్ సంస్థల్లోకి తీసుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వీరిని విద్యార్హతలను బట్టి రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. 20 నుంచి 30 ఏళ్ల పని చేసినా ఎలాంటి విరమణ ప్రయోజనాలు రావడం లేదన్నారు. జీత భత్యాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. జీఓ 308 ప్రకారం ఆర్టిజన్‌లందరికీ కన్వర్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2006లో రాష్ట్రంలో 7,114 సీజేఎల్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని కలిసి ఈ పోస్టులన్నీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారితోనే భర్తీ చేయాలని కోరితే స్పందించి వీరితోనే భర్తీ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేశ్, జేఏసీ నాయకులు జి.నాగరాజు, అరవింద్, బి.శంకర్, ఎస్.సదానందం, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వర్ రావు

ఇసుక లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- బెగులూర్‌లో ఘటన



రమేశ్(ఫైల్)

కాళేశ్వరం : ఇసుక లారీ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మహదేవపూర్ మండలం బెగులూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దోమల రమేశ్(30), ముల్కల లక్ష్మీ నారాయణ బైక్‌పై తమ పొలానికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఎల్‌అండ్‌టీ రహదారిపై సూరారం వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఇసుక లారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వెనుక కూర్చున్న లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భూపాలపల్లికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీ అతివేగమే కారణం..

ఇసుక లారీ అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, సంబంధిత అధికారులు, పోలీసులు డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించకపోవడంతో మద్యం మత్తులో లారీలను అతివేగంగా నడిపి ప్రాణాలు తీస్తున్నారని స్థానికులు ఆరోపించారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ రాజన్న

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ

ఖిలా వరంగల్: అధిక సాంద్రతతో పత్తి సాగు చేయడం వల్ల గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి పంటను కాపాడుకోవచ్చని, దీని నివారణకు రైతులు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. ఈమేరకు గురువారం ఖిలా వరంగల్ తూర్పు కోటలోని రైతు భవనంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విద్యాలయం పరిధి కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు, వరంగల్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరై పత్తి పంటను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి పంట సాగు చేయడం వల్ల కూలీల ఖర్చు, పంట కాలం తగ్గుతుందని, ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త సీహెచ్ సౌమ్య మాట్లాడారు. పత్తి సాగులో తప్పనిసరిగా సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నూజీవీడు విత్తన సంస్థ రీజనల్ మేనేజర్ మురళీమోహన్, డిస్ట్రిబ్యూటర్ రామచంద్రారెడ్డి, వరంగల్ ఏఓ రవీందర్‌రెడ్డి, ఏఓ హరిప్రసాద్, కార్పొరేటర్ భోగి సువర్ణ, నూజీవీడు సెల్స్ ఆఫీసర్ నాగరాజు, కేవీకే యంగ్ ప్రొఫెషనల్ హర్షరెడ్డి, సాయి చంద్, రైతులు పాల్గొన్నారు

దశదిన కర్మలో పాలి పంచాయితీ

- కుల బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న ఎల్లయ్య, ఉపేంద్ర దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: అన్న దశదిన కర్మకు వెళ్లిన తమ్ముడి కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారు. ఈ ఘటన బుధవారం మండలంలోని ఇప్పగూడెంలో జరగగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు ఎల్లయ్య, ఉపేంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోటకూరి ఎల్లయ్య అన్న హన్మంతు ఇటీవల మృతిచెందాడు. అతడి దశదిన కర్మ కార్యక్రమాలు ఈనెల 16వ తేదీన నిర్వహించగా ఎల్లయ్య, ఉపేంద్ర దంపతులు వెళ్లారు. కార్యక్రమాలు పూర్తయ్యాక పాలివారందరూ స్నానాలు చేసే చోట తోటకూరి బీరయ్య, తోటకూరి రాజు, రవి, నాగరాజు, రాజు తదితరులు ఎల్లయ్య, ఉపేంద్ర దంపతులను స్నానం చేయకుండా అడ్డుకున్నారు. 'మీరు మా పాలివారు కాదు.. మాతో కలవొద్దు.. మాతో స్నానం చేయొద్దు' అని ఇష్టారాజ్యంగా తిడుతూ అక్కడి నుంచి వెలివేశారు. ఈ విషయమై ఎల్లయ్య, ఉపేంద్ర దంపతులు పెద్ద మనుషులను సంప్రదించగా ఉద్దేశపూర్వకంగా బహిష్కరించారని వారు కూడా తెలిపారు. దీంతో ఘటనపై బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.